

# కృతి – ఆకృతి

## – అపర్ణ మునుకుట్ల గునుపూడి



09

ఈ శీర్షిక ఉద్దేశ్యం కర్ణాటక సాంప్రదాయ సంస్కృతాంధ్ర కృతులలో భాష, రాగ, భావములను ప్రస్తావించి, మీకు శ్రావ్యానుభూతి కోసం ఆ కృతిని కూడా జత పరిచి మీ కందించాలని. ఈ కృతులందరికి తెలిసినవే అయినా వాటి సాహిత్య, రాగ, భావ ప్రకటనలు తెలిసేక మళ్ళీ విన్నప్పుడు ఆ కృతియొక్క ఆకృతిలో మీకు మరొక కోణం కనిపించవచ్చునేమో అన్నదే మా ఆలోచన, ఈ చిన్ని ప్రయత్నం.

గమనిక: పల్లవి, అనుపల్లవి, చరణములు ఉండి, సంగీత ప్రాధాన్యత కలిగి పెక్కు సంగతులతో రాగసంచార, భావప్రస్తారమునకు వీలుగా, స్వరకల్పనలో పాండిత్య ప్రతిభను ప్రదర్శించు విధముగా ఉన్నటువంటివి కృతులు. పల్లవి, అనుపల్లవి, పెక్కు చరణములు కలిగి ఒకే పద్ధతిలో గానము చేయగలిగి, భావ ప్రాధాన్యత కలిగినటువంటివి కీర్తనలు.

గాత్రం: అరవింద్ లక్ష్మీకాంతన్

Click Here to Watch

రచన: ముత్తుస్వామి దీక్షితులు

రాగం: సారంగ

తాళం: రూపక తాళం

పల్లవి:

అరుణాచలనాథం స్మరామి అనిశం అపీతకుచాంబా సమేతం

అనుపల్లవి:

స్మరణాత్కైవల్య ప్రద చరణారవిందం

తరుణాదిత్య కోటి సంకాశ చిదానందం

కరుణా రసాది కందం శరణాగత సుర బృందం

చరణం:

అప్రాకృత తేజోమయలింగం అత్యద్భుత కరధృత సారంగం

అప్రమేయమ అపర్ణాబ్జ భృంగమ్ ఆరూఢోత్తుంగ వృష తురంగం

విప్రోత్తమ విశేషాన్తరంగం వీర గురుగుహతార ప్రసంగం

స్వప్రదీప మౌళి విధృత గంగం స్వప్రకాశ జిత సోమాగ్ని పతంగం

ఈ కృతి తిరువణ్ణామలై లో ఉన్నటువంటి తేజోమయమైన అగ్ని లింగ ప్రధానమైన అరుణాచలేశ్వరుని వర్ణిస్తూ రాసినది. ఈ క్షేత్ర విశేషమేమిటంటే, అరుణాచలనాథుని వెళ్లి దర్శనం చేసుకోవాలన్న నిబంధనలు లేవు, కేవలం తలుచుకుంటేనే చాలు కైవల్య ప్రాప్తి. అందుకే పల్లవిలో అహర్నిశలూ అపీతకుచాంబ సమేతుడైన అరుణాచలనాథుని తలుచుకోమని అంటూ, అనుపల్లవిలో మళ్ళీ ఆ మాటనే వక్కాణిస్తూ, మధ్యాహ్నపు వేళలో వెలిగే సూర్యుని వలె కోటి కిరణ సదృశుడు, చిదానంద స్వరూపుడు కరుణారసభరితుడూ అయిన ఆ శివుని శరణు కోరి, పాదపద్మాలను తలుచుకున్నంతనే కైవల్యం

ప్రసాదిస్తాడని అంటారు. ఇక చరణంలో గాయకులకు ఉల్లాసం కలిగించే అంత్య ప్రాసలతో ఇలా వర్ణిస్తారు. ప్రకృతి కానటువంటి విధంగా తేజోలింగమై వెలసి, చేతిలో అత్యద్భుతమైన లేడిని (సారంగం కృతి యొక్క రాగం) పట్టుకుని, ఇంకొకరి ప్రమేయం లేకుండా అపర్ణ (పార్వతీదేవి) హృదయకమలం చుట్టూ తుమ్మెదలా తిరిగేవాడు, ఎత్తైన నందిని వాహనంగా ఎంచుకున్నవాడు, ఉత్తములైనవారి హృదయాల్లో తిరిగేవాడు, వీరుడైన కార్తికేయునితో (గురుగుహ) ప్రసంగించేవాడు, తలపై చంద్రుని అలకరించుకుని, గంగను ప్రవహింపజేసేవాడు, అగ్ని, సూర్య, చంద్రులను ఓడించేటటువంటి స్వయంప్రకాశుడు అని అంటారు. రజోగుణమైన ఈ అగ్నిలింగ కృతిలో చెప్పుకోవాల్సిన కొన్ని ముఖ్య లక్షణాలు, కృతి ఎక్కువగా మంద్రస్థాయిలో శవానుగా ఉండి, హాయిని కలిగించే మంద్రగతిలో ఉండడం. మూడు చోట్ల మాత్రం తారాస్థాయిలోకి వెళుతుంది. ఆ మూడు ఏమిటీ? కైవల్యం అంటే ఊర్ధ్వలోకం, ఆరూఢోత్తుంగ అంటే ఎత్తైన దాన్ని ఎక్కడం, మౌళి విధృత అంటే తలపైనుండి జారడం. ఆ సమాసాలన్నీ కూడా అందుకు అనుగుణంగా ఎత్తుని సూచించే సమాసాలని గమనించవచ్చును.

సౌరశక్తి గురించి ఉపనిషత్తుల్లో ఇలా అంటారు.

న తత్ర సూర్యో భాతి న చంద్ర తారకం

నేమా విద్యుతే భాన్తి కృతోయం అగ్ని:

తమేవ భాంతమనుభతి సర్వం

తస్య భాసా సర్వం ఇదం విభాతి

సూర్యుడు లేకుండా చంద్రుడు, గ్రహాలు వెలగవు. సూర్య కిరణ/శక్తి సమూహం అగ్నిని పుట్టిస్తుంది. అగ్ని తన చుట్టూ ఉన్న వాటిని ప్రకాశింపజేస్తుంది. ఆ ప్రకాశకాంతులు యావత్విశ్వాన్ని భాసింపజేస్తాయి అని అర్థం. అందువలన ఆ సూర్యుడు మానవ మనుగడకే అతి ముఖ్యం అని తెలియజేస్తోంది. అటువంటి సౌరశక్తినిచ్చే సూర్యుడితో పోల్చడం గొప్ప ఉపమానం.

పృథ్వీ, జల లింగ కృతుల్లో పార్వతి దేవి కోరికపై ఆయా చోట్ల వెలసినట్టుగా చెప్పేరు. కానీ ఇక్కడ అగ్నిలింగంగా రావాలని ఆయనకి ఎందుకు తోచింది? దాని వెనక కథ ఇది. శివమాయలో పడిన బ్రహ్మ, విష్ణువు అత్యహంకారంతో నేను గొప్పంటే నేను గొప్పని వాదులాడుకుంటూ యుద్ధకాండ సలుపుతూ ఉంటె అక్కడికి శివుడు వచ్చి వారి అహంకారం అణచడానికి మహోజ్వల తేజంతో అగ్ని స్తంభంగా ఆవిర్భవిస్తాడు. బ్రహ్మ, విష్ణువులు ఆ వినూత్న తేజానికి విస్మయం చెంది దాని ఆద్యంతాలు తెలుసుకోవడానికి విష్ణువు స్వేత వరాహమై పాతాళలోకాల్ని చీల్చుకుంటూ కిందకి, బ్రహ్మ హంస రూపంలో పైకి బయలుదేరుతారు. కిందకి దొలుచుకుంటూ ఎంత వెళ్లినా తేజస్థంభారంభం దొరకదు విష్ణువుకి. ఇది తనవల్ల కాని పనని విష్ణువు తిరిగి యథాస్థలం చేరుకుంటాడు. బ్రహ్మ పైకి ఎగిరి ఎగిరి ఎంతకీ అంతు చిక్కక ఆలోచిస్తున్న సమయంలో ఆ జ్వాలాగ్రం నుండి మొగలి పువ్వు కిందకి పడుతూ కనిపిస్తుంది. బ్రహ్మ దాన్ని ఆపి, ఈ స్థంభాగ్రం ఎంతవరకో తెలుసా అని అడుగుతాడు. మొగలి "నేను అక్కడినుంచే వస్తున్నాను కానీ నేను ఇక్కడిదాకా వచ్చేలోపల ఇంకెంత పెరిగిందో నాకు తెలియదు. దాన్ని కనుక్కోవడం నీ తరం కాదు" అంటుంది. బ్రహ్మకి కాస్త బాధ కలుగుతుంది. వెనక్కి వెళితే విష్ణువు ముందర ఓటమి ఒప్పుకోవాలి, కానీ తానే గొప్ప అని నిరూపించుకోవాలి అనుకుని, ఓ మొగలిపువ్వా, నాకో ఉపకారం చెయ్యమని వేడుకుంటూ, నేను కిందకి విష్ణువు దగ్గరికి వెళ్లి స్తంభాగ్రాన్ని చూసేనని చెబుతాను. నువ్వు అది నిజమని చెప్పాలి అంటాడు. మొగలిపువ్వు ఒప్పుకుని ఇద్దరు కిందకి చేరి, బ్రహ్మ విష్ణువుతో తాను స్తంభాగ్రాన్ని చూసేనని, మొగలి పువ్వు సాక్ష్యమని అంటాడు. మొగలిపువ్వు అవునంటుంది. విష్ణువు తాను దాని మొదలు చూడలేకపోయానని ఓటమి ఒప్పుకుని బ్రహ్మని ఆరాధిస్తూ అక్కడే కూర్చుంటాడు. విష్ణువులో అహంకారం నశించి తన ప్రవర్తనకి పశ్చాత్తాపపడి శివశివా అనుకుంటాడు. వెంటనే శివుడు ఆ అగ్నిస్తంభమునుండి ప్రత్యక్షమవుతాడు. భక్తి ప్రపత్తులతో శివుణ్ణి స్తుతిస్తాడు విష్ణువు. విష్ణువుని అనుగ్రహించి, " నారాయణా నీ సత్య సంధతకి మెచ్చాను. సత్యమే శాశ్వతమైనది. ఇకనుండి అన్ని లోకాల్లోనూ నాతో సమానంగా పూజింపబడతావు" అని దీవించుతాడు. ఇక అసత్యవాది అయిన బ్రహ్మను దండించడానికి భైరవుడిని సృష్టించి అతన్ని ప్రేరేపిస్తాడు. భైరవుడు తన పదునైన కత్తితో అసత్యం చెప్పిన బ్రహ్మయొక్క అయిదవ తలను నరికేస్తాడు. మిగతా తలల్ని నరకే లోపల బ్రహ్మ భయంతో వణుకుతూ శివశివా అంటూ శివుడి పాదాలమీద పడతాడు. విష్ణువుకి కూడా జాలి కలిగి బ్రహ్మని రక్షించమని వేడుకుంటాడు. శివుడు దయ తలిచి క్షమించి, "అసత్య దోషం వల్ల నీకు ఎక్కడా పూజార్హత ఉండదు" అని, ఆ పక్కనే ఉన్న మొగలిపువ్వు ని చూసి "కేతకీ, పుష్పజాతికే కళంకం తెచ్చిన నువ్వు నా పూజకి పనికిరావు" అంటాడు. కేతకి పశ్చాత్తాపంతో ప్రాధేయపడి మొరపెట్టుకుంటే "పూజకి పనికిరావు కాని నాకు అలంకరించడానికి ఉపయోగపడతావు" అని దీవిస్తాడు. అగ్ని ఏ విధంగా వస్తువులని క్షణాల్లో దహించి, భస్మం చేస్తుందో ఆదే విధంగా అహంకారాన్నిఅణగించి, అసత్యాన్ని

తొలగించడానికి శివుడు అగ్నిలింగమయ్యాడని శివ పురాణం చెబుతోంది. ఆ జ్వాలాస్తంభం ఆవిర్భవించిన రోజు మార్గశిర బహుళ చతుర్దశి, ఆరుద్ర నక్షత్రంనాడు, శివ కల్యాణానికి, శివారాధనకి పరమ శ్రేష్టం. అరుణాచలంలో జ్వాలా దర్సనానికి అనేకమంది భక్తులు వెళతారు. అలాగే భక్తులు కొండ చుట్టూ గిరి ప్రదక్షిణం (14km) చేయడం కూడా పరిపాటే. ఆ ప్రదక్షిణ మార్గంలో ఎనిమిది శివలింగాలు (నాలుగు దిక్కుల్లో, నాలుగు మూలల్లో) ఉంటాయిట. అవి ఇంద్ర, అగ్ని, యమ, నైరుతి, వరుణ, వాయు, కుబేర మరియు ఈశాన్య లింగాలు. మూలస్థానంలో అగ్నిలింగం సూర్యుడైతే ఈ అష్ట లింగాలు ఒక్కక్కటికి ఒక గ్రహాన్ని ఆపాదిస్తారు. గిరి శిఖరాన్ని చూస్తూ, ఆయా లింగాలకి పూజ చేస్తూ గిరి ప్రదక్షిణం చేస్తే ఇహంలో మన:శాంతిని, ఆరోగ్యాన్ని, పరంలో కైవల్యాన్ని ప్రసాదిస్తుందంటారు. అంత దూరం వెళ్లలేని వారు ఈ కృతి వింటే స్మరించినంత పుణ్యం.

క్రితం నెల వ్యాసం చదివిన వారిని నేనున్న చోట వర్షాలు కురవాలని కోరుకొమ్మన్నట్టుగానే, అగ్ని ప్రధానమైన ఈ నెల వ్యాసం చదివినవారు, కాలిఫోర్నియాలో కార్చిచ్చులు రాకుండా కాపాడి, అందరినీ చల్లగా చూడమని, ఆ పరమ శివుడిని తప్పకుండా కోరుకుంటారు కదూ.

అరవింద్ లక్ష్మీకాంతన్, వృత్తి ఫైనాన్స్ డైరెక్టర్ అయితే ప్రవృతి సంగీతోపాసన. శ్రీమతి లాల్గుడి శ్రీమతి బ్రహ్మానందంగారి శిష్యుడు. వీరు ప్రథమస్థాయి గాయకులకు వాయులీన సహకారం అందించడమే కాకుండా దేశ విదేశాల్లో విరివిగా సంగీత స్వీయ కచేరీలు చేస్తూంటారు. ప్రస్తుతం వీరు ఫిలడెల్ఫియా USA నివాసస్థులు.

COMMENTS